క్లుప్తంగా

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ఖమ్మంమయూరిసెంటర్: గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి అధికారులకు సూచించారు. సోమవారం కేఎంసీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో 14 ఫిర్యాదులు అందాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూ విభాగానికి సంబంధించినవి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వో జి.శ్రీనివాసరావు, ఆర్ఐ లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలుచేస్తున్న విద్యాసంస్థల బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జనసేన ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జ్ మిరియాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం ఆయన కలెక్టర్ వీ.పీ.గౌతమ్, డీఈఓ సోమేశ్వరశర్మకు వినతిపత్రాలు అందజేశారు. నాయకులు బండారు రామకృష్ణ, కార్తీక్, అజయ్‌కృష్ణ, శ్రీకాంత్, ఉపేందర్, స్రవంత్ కన్న, గంగాధర్, విజయ్, రాకేష్, ఉదయ్, నరేంద్ర, విక్రమ్, శ్రావణ్, దుర్గ, వాసు, సాయి, గణేష్ పాల్గొన్నారు.

పైపు కల్వర్టు పనుల ప్రారంభం

రఘునాథపాలెం: మండలంలోని రాంక్యాతండా పుటానితండా రోడ్డులో రూ.2.50లక్షలతో చేపడుతున్న పైపు కల్వర్టు పనులను సోమవారం ప్రారంభించారు. వర్షాకాలంలో వరద నీటితో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యాన కల్వర్టు నిర్మాణం చేపడుతున్నట్లు పీఆర్ ఏఈ ఆదిత్యరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో తారా చంద్, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్


శకుంతల

కూసుమంచి: కూసుమంచి తహసీల్దార్‌గా వి.వి.శకుంతల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు తహసీల్దార్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లు వితరణ


రెయిన్ కోట్లు అందజేస్తున్న వైష్ణవి ప్రసన్న కృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: పారిశుద్ధ్య కార్మికులకు కన్నం కనకయ్య జ్ఞాపకార్థం కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం రెయిన్ కోట్లు వితరణగా అందజేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాల్, జవాన్ శ్రీనివాస్, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రియదర్శినిలో 'గూగుల్ మీట్'

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం అనలాగ్ వ్యోమగామి దంగేటి జాహ్నవి విద్యార్థులతో గూగుల్ మీట్‌లో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పంజాబ్‌లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జాహ్నవి తన లక్ష్యాలు, అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. 19 ఏళ్లలోనే జాహ్నవి దక్షిణ పోలాండ్‌లోని క్రాకోవ్‌లోని అనలాగ్ ఆస్ట్రోనాట్ ట్రెనింగ్ ప్రోగ్రాంను పూర్తి చేసిన అతిపిన్న వయస్కురాలిగా చరిత్ర సృష్టించింది. చంద్రుడిపై అడుగు పెట్టిన తొలి ఇండియన్ అని అనిపించుకోవడమే తన లక్ష్యమని ఆమె విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కె. నవీన్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తిలో మాజీ సర్పంచ్ తమ్మినేని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు సోమవారం సంబురాలు చేసుకున్నారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు, పలువురు నాయకులు పార్టీలో చేరేందుకు ఢిల్లీలో నాయకులను కలవడంపై హర్షం వ్యక్తం చేస్తూ బాణాసంచాలు కాల్చుతూ, స్వీట్లు పంచుకున్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఆదిపురుష్
వినోద	అశ్విన్స్
సాయిరాం	భీమదేవరపల్లి బ్రాంచి, కర్ణ
ఆదిత్య	మను చరిత్ర
శ్రీనివాస	1920

- ఖమ్మం గాంధీచౌక్

'వసతి' లేనట్టేనా..?

గిరిజన విద్యార్థులకు కరువైన వసతిగృహాలు

- ఇతర శాఖల వాటికి వెళ్తున్న విద్యార్థులు
- అక్కడా సీట్లు లేకపోవడంతో వెనుదిరుగుతున్న వైనం
- జిల్లా కేంద్రంగా ట్రైబల్ ప్రీ మెట్రిక్ వసతిగృహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్


కొణిజర్లలో నిర్వహిస్తున్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల

ఖమ్మంమయూరిసెంటర్: పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచిత విద్య, వసతి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలను నిర్వహిస్తోంది. విద్యార్థులు అక్కడ వసతి, భోజన సదుపాయాలు పొంది, దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తు ఉంటారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వసతిగృహాలను నిర్వహిస్తున్నారు. అయితే ఖమ్మం జిల్లా కేంద్రంగా ఈ మూడు శాఖల ఆధ్వర్యంలో ప్రీ, పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలను ఏర్పాటు చేశారు. ఎస్సీ, బీసీ శాఖల ఆధ్వర్యంలో ఖమ్మం కేంద్రంగా వసతిగృహాలు ఉన్నప్పటికీ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు మాత్రం ఉన్న వసతిగృహాలను తొలగించారు. ఖమ్మం కేంద్రంగా ఉన్న ఎస్టీ బాలుర, బాలికల వసతి గృహాలను తీసి కొణిజర్ల కేంద్రానికి మార్చారు.

ఇబ్బందుల్లో విద్యార్థులు..

గతంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం బోనకల్ రోడ్డులో ఎస్టీ బాలికల వసతిగృహం, కాల్వొడ్డులో ఉన్న ఎస్టీ బాలుర వసతిగృహాలను ఆశ్రమ పాఠశాలలుగా మార్చి వాటిని కొణిజర్ల కేంద్రంగా నిర్వహిస్తున్నారు. దీంతో ఖమ్మంలో గిరిజన విద్యార్థులకు ప్రీ మెట్రిక్ వసతిగృహం, ఆశ్రమ పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూరల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వసతిగృహాల్లో కనీస సౌకర్యాలు ఉండడం లేదని, ఖమ్మం కేంద్రంగా వసతిగృహం ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. నగరంలో ఎస్టీ ప్రీ మెట్రిక్ వసతిగృహాలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు. అయితే వారు మాత్రం పట్టించుకోవడం లేదు.

ఇతర శాఖల వసతి గృహాలకు..

నగరంలో ఎస్టీ ప్రీ మెట్రిక్ వసతిగృహాలు లేకపోవడంతో ట్రైబల్ విద్యార్థులు ఇతర శాఖల వసతిగృహాల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఖమ్మం కేంద్రంగా చదువుకోవాలనే సంఖ్య పెరగడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఎస్సీ, బీసీ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహాలకు వెళ్లి సీట్లను కోరుతున్నారు. అక్కడ వారికి కేటాయించిన రిజర్వేషన్ కోటా సీట్లు అయిపోవడం, రిజర్వేషన్‌కు మించి సీట్లు ఇవ్వలేమని అధికారులు చెపుతుండడంతో విద్యార్థులు వెనుదిరుగుతున్నారు. ఇక ఎస్సీ, బీసీ వసతిగృహాలకు ట్రైబల్ విద్యార్థులు సీట్ల కోసం పోటెత్తుతుండడంతో సంక్షేమ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎస్సీ, బీసీ విద్యార్థులను కాదని ట్రైబల్ విద్యార్థులకు సీట్లు ఇవ్వలేమని తేల్చి చెబుతున్నారు.

జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలి



జిల్లా కేంద్రమైన ఖమ్మంలో గిరిజన శాఖకు చెందిన ప్రీ మెట్రిక్ వసతిగృహం ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. గిరిజన విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇక్కడ ఉన్న వసతిగృహాలను తొలగించి, కొణిజర్ల కేంద్రంగా ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయడం తగదు. ఖమ్మంలో ప్రీ మెట్రిక్ వసతిగృహాలను ఏర్పాటు చేయాలి.

– వి.వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

గిరిజన విద్యార్థులను దృష్టిలో ఉంచుకోవాలి



ఖమ్మం కేంద్రంగా గిరిజన శాఖకు గతంలో ఇక్కడ వసతిగృహాలు ఉండేవి. అధికారులు ఉన్నతాధికారుల వద్ద మెప్పు కోసం ఇక్కడ వసతిగృహాలను ఆశ్రమ పాఠశాలలుగా మార్చి కొణిజర్లకు తరలించారు. గిరిజన విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఖమ్మంలో వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలి.

– ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


ఖమ్మంరూరల్: ధర్నా చేస్తున్న నాయకులు


ఖమ్మంమయూరిసెంటర్: సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు


తిరుమలాయపాలెం: తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


నేలకొండపల్లి: ధర్నా చేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు ఎర్రా శ్రీకాంత్, వి.సుదర్శన్‌రెడ్డి, నండ్ర ప్రసాద్, పి. సత్యనారాయణ, పి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంమయూరిసెంటర్: గృహలక్ష్మి పథకం కింద నిర్మించే ఇళ్లకు విధి విధానాలు ప్రకటించాలని బీసీ హక్కుల పోరాట సమితి నగర కార్యదర్శి జ్వాల నర్సింహరావు అన్నారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన సమితి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయాలని, 120 గజాల స్థలంలో ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలన్నారు. నాయకులు మేకల నాగేశ్వరరావు, జ్వాల శ్రీను, వల్లపు శ్రీనివాసరావు, మాదుగుల వెంకటేశ్వర్లు, బి శ్రీను, వల్లపు నరసింహరావు, కోటేశ్వరరావు, అనసూర్య, జే.సుగుణ, జ్వాల మనీ పాల్గొన్నారు.


తిరుమలాయపాలెం: గృహలక్ష్మి పథకానికి ప్రభుత్వం రూ.5లక్షలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు స్థానిక తహసీల్‌ను ముట్టడించి తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఎర్ర శ్రీనివాసరావు, షేక్ బషీరుద్దీన్ శ్రీను, నర్సయ్య, తుల్లూరి నాగేశ్వరరావు, వెంకట్రావు, సురేష్, బింగి రమేష్, వెంకటనర్సయ్య, వాసయ్య పాల్గొన్నారు.

నేలకొండపల్లి: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారికి వినతి పత్రం అందించారు. నాగేశ్వరరావు, రామారావు, రచ్చా నరసింహారావు, కట్టికోల వెంకన్న, దుగ్గి వెంకటేశ్వర్లు, కొండలరావు, లాల్‌సాహెబ్, లింగరాజు, అడపాల రమణ, వెంకట్రావమ్మ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలను విజయవంతం చేయాలి

ఖమ్మంరూరల్: జూలై1న పెదతండాలో నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ యూత్ నాయకులు రాంరెడ్డి చరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పెదతండాలో జరిగిన అవగాహనా సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్నత చదువులు చదివి కొలువులు లేక యువత నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. వివిధ అంశాలపై అవగాహన ఉండేలా నియోజకవర్గ వ్యాప్తంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పోటీ కోసం ఆన్‌లైన్ చేయించారు. ఈ కార్యక్రమంలో బాణోత్ కిషోర్, ఎరబోలు శ్రీను, బాణోత్ హరినాథ్, దివ్యనాయక్, సునీల్, నరేందర్, హరిప్రసాద్, రమేష్‌నాయక్, తరుణ్, సంతోష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయాల్లో పూజలు


వరప్రదాత మందిరంలో పూజలు

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి సందర్భంగా నగరంలోని రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ కృష్ణ సాయి ఆశ్రమంలో బాబాకు, సోమవారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం అపమృత్యుదోష నివారణ కోసం రుద్రహోమం, లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని చేశారు. ఆశ్రమ కమిటీ చైర్మన్ లగడపాటి రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ప్రతినిధులు సిద్దంశెట్టి నాగమణి, కన్నం రమణ, సిద్దంశెట్టి శ్రీకాంత్, దోసపాటి సంధ్య, సరాబు రమేష్, కంచకర్ల విజయశ్రీ, పైడిమర్రి సత్యనారాయణ, పసుమర్తి స్మిత, మోటమర్రి రాజ్యలక్ష్మీ,లలితమ్మ పాల్గొన్నారు. అన్నపూర్ణ శాల కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా నగరంలోని గాంధీ చౌక్‌లో ఉన్న వరప్రదాత షిర్డీ సాయి మందిరంలో బాబాను విభూదితో అభిషేకం చేశారు. ఛైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావు తదితరులు కార్యక్రమాలను నిర్వహించారు.

హార్వెస్ట్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: మ్యాథ్స్ అసోసియేషన్ ఆఫ్ అమెరికా నిర్వహించిన మ్యాథ్ ఒలింపియాడ్‌లో హార్వెస్ట్ విద్యాసంస్థల విద్యార్థులు ఆలిండియా మొదటి ర్యాంక్ సాధించారని కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ.. వివిధ దేశాల 8నుంచి 12వ తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ బ్రాంచ్ ఇన్‌చార్జ్ జి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణపేశ్వరాలయంలో జడ్జి పూజలు


జడ్జికి జ్ఞాపికను అందజేస్తున్న పాలకమండలి

కూసుమంచి: కూసుమంచిలోని పురాతన శివాలయం (గణపేశ్వరాలయం)లో సోమవారం జిల్లా ఫ్యామిలీ కోర్టు జడ్జి అర్చన కుమారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శేషగిరి శర్మ పూజాకార్యక్రమాలు నిర్వహించి, ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం జడ్జిని ఆలయ కమిటీ చైర్మన్ కొక్కిరేని వీరస్వామితో పాటు డైరెక్టర్లు సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీకాంత్, డైరెక్టర్లు, సునీత, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, సత్యం, నాగయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

బుడగ జంగాలను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని 22వ డివిజన్‌లోని బుడగ జంగాల వారిని కాంగ్రెస్ నాయకులు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ మాట్లాడుతూ.. వచ్చేనెల 2 నుంచి 5వ తేదీ వరకు జిల్లాలో జరగనున్న పీపుల్స్ సభను జయప్రదం చేయాలని కోరారు. బుడగజంగాల నేతలు పాల్గొన్నారు.

సన్మానం

రఘునాథపాలెం: మండలకేంద్రమైన రఘునాథపాలెం సర్పంచ్ గుడిపుడిశారద రామారావు దంపతులను సోమవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పంచాయతీ అభివృద్ధితో పాటు, జిల్లా స్థాయిలోనే ఉత్తమ పంచాయతీగా అవార్డును దక్కించుకోవడం అభినందనీయమన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు సహకరించాలి


మాట్లాడుతున్న ఏడీఈ కోక్యానాయక్

నేలకొండపల్లి: విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కూసుమంచి విద్యుత్ శాఖ ఏడీఈ కోక్యానాయక్ కోరారు. మండలంలోని రాజేశ్వరపురం రైతు వేదికలో సోమవారం విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లో ఓల్టేజీ, ఓవర్ లోడ్ లాంటి సమస్యలు రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీలు 101 యూనిట్లు లోపు వారు ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ దండా పుల్లయ్య పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రైతులకు ఇస్తున్నట్లుగానే పంచాయతీలో మంచినీటి సరఫరా చేసే విద్యుత్ మోటార్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్థంభాలను వెంటనే మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరపురం ఏఈ బాలాజీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దండా నరసింహారావు, యర్రబోయిన జంగం, పుసులూరి శారద, షేక్ సొందుమియా, మునగంటి వీరబాబు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 9న 'బ్రహ్మగర్జన' సభ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘాల ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: అర్చక–పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా సాధించుకునేందుకు 'బ్రహ్మ గర్జన' నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ వనం కృష్ణవేణి తెలిపారు. బ్రాహ్మణుల హక్కులు, ఆత్మగౌరవం కోసం వచ్చే నెల 9న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే బ్రహ్మగర్జన పోస్టర్లను సోమవారం ఖమ్మంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ..బ్రాహ్మణ అస్తిత్వాన్ని కాపాడుకోవడంతో పాటు కుల ధర్మ పరిరక్షణ, రాజకీయ పురోగమనానికి తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యాన ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొదమసింహం మురళీకృష్ణమాచార్యులు, మంత్రిప్రగడ జగన్మోహన్‌రావు, తాటికొండల సీతారామశాస్త్రి, కడారు పాండురంగారావు, ఉపాధ్యాయుల గోపాలకృష్ణమూర్తి గొట్టుపర్తి పార్వతి, కొట్టూరి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టి.ప్రవీణ్ విమర్శించారు. పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంం అందించాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ... విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజుల అయినా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో పుస్తకాలు, యూనిఫాం ఇవ్వలేదన్నారు. ఈ సమస్యతో పాటు ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పర్వీన్, సాయి, నవ్య, సంగీత, వీరేందర్, రాగిణి, సరళ, సుమలత, షరీఫా, సమీరా పాల్గొన్నారు.

రిజర్వేషన్ సాధనకు ఉద్యమించాలి

నేలకొండపల్లి: ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్ సాధనకు క్షేత్ర స్థాయి నుంచి ఉద్యమించాలని యూనిటి ఆఫ్ మాల జిల్లా అధ్యక్షుడు కందుల ఉపేందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సంఘం యూనివర్స్ డే సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆవుటి మధు(చెన్నారం), ప్రధాన కార్యదర్శిగా కర్ల అశోక్ (కోనాయిగూడెం) గౌరవాధ్యక్షుడిగా గెంటెల క్రీస్తుదాసు (చెన్నారం), సోషల్ మీడియా కార్యదర్శిగా చలవాది వెంకటరత్నం లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కనకరాజు, మల్లయ్య, కనకయ్య, మేడికొండ శౌరీ, జంగం లక్ష్మినారాయణ, బందెల ప్రసాద్, వీరబాబు, పెంటమళ్ల పుల్లయ్య, బిందె వెంకటనర్స్, రత్నం పాల్గొన్నారు.

పాలకులవి రైతు వ్యతిరేక విధానాలు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రఘునాథపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ప్రజాపంథా జిల్లా నాయకుడు ఆవుల వెంకటేశ్వర్లు ఆరోపించారు. మండలంలోని వేపకుంట్లలో మాజీ సర్పంచ్ వి.ఆదాం సంతాపసభ సోమవారం ఏర్పాటుచేయగా ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిందని తెలిపారు. కనీస మద్దతు ధరల నిర్ణయం విషయంలో అన్యాయం చేశారని విమర్శించారు. ఇక రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు అమలు పేరిట మిగతా పథకాలను రద్దు చేసిందన్నారు. ఈ సభకు కూరాకుల నర్సయ్య అధ్యక్షత వహించగా ఆవుల మంగతాయి, మేక రామనాథం, గుణగంటి వీరబాబు, పొట్లపల్లి కృష్ణ, నేరాల బాలస్వామి, కంకణాల శ్రీనివాస్, కంటిపూడి, ఇజ్రాయిల్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

డిఫెన్స్ కౌన్సిల్‌కు అభినందన


అభినందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మంలీగల్: తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం లీగల్ సర్వీసెస్ సంస్థ నూతనంగా చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులుగా నియమించిన మామిడి హనుమంతరావు, మల్లెబోయిన వలరాజు, శ్రీనివాస్‌రావులను టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది డాక్టర్ మద్ది శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తవనం శేఖర్ రెడ్డి, మొజెస్ క్రిస్టోఫర్, సాలం వెంకటేశ్వర్లు, శాంతరావు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనే..

ఖమ్మంమయూరిసెంటర్: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని లేదంటే ఆందోళన చేపడతామని పెన్షనర్ల జేఏసీ కో ఆర్డినేటర్ టి.పురుషోత్తం హెచ్చరించారు. సోమవారం పెన్షనర్ల జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం స్థానిక మంచికంటి భవన్‌లో నిర్వహించారు. ఎల్.గోపిచంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పురుషోత్తం మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న రెండు డీఆర్‌లు విడుదల చేయాలని, ఈహెచ్‌ఎస్ పథకాన్ని నగదు రహిత పథకంగా మార్చి అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అనుమతించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, బుధవారం కలెక్టరేట్ ఎదుట జరిగే ఆందోళనలో పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు పరిశ పుల్లయ్య, నాగేశ్వరరావు, రంగారావు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

కూసుమంచి: మండలంలోని జక్కేపల్లి గ్రామానికి చెందిన వంకత్తుల జ్యోతి పోగొట్టుకున్న ఫోన్‌ను ఎస్సై రమేష్‌కుమార్ సీఈఐఆర్ పోలీస్ పోర్టల్‌తో కనుక్కొని బాధితురాలకు సోమవారం అందజేశారు. ఈ మేరకు తన ఫోన్‌ను అప్పగించినందుకు జ్యోతి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మేల్కొనకపోతే ముప్పే..



ఖమ్మంమయూరిసెంటర్: వేసవిలో ఎండ తాపం నుంచి ఉపసమనం కోసం ప్రజలు కొబ్బరి బోండాలు తాగారు. అయితే, అమ్మకందారులు ఖాళీ బోండాలను ఎక్కడికక్కడే పడేసి వెళ్లిపోయారు. ఫలితంగా నగర శివారు ప్రాంతాలు, పలు కూడళ్ల వద్ద కుప్పలుగా బోండాలు కనిపిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బోండాల్లో నీళ్లు చేరితే దోమలు ఉత్పత్తి అయ్యేందుకు అవకాశముంది. ఈ మేరకు వ్యర్థాల తొలగింపుపై కేఎంసీ సిబ్బంది చొరవ చూపాలని నగర వాసులు కోరుతున్నారు.